# 6

# తెరచుటకు ముందు ఆలోచించండి!

## (మత్తయి 5:33-37)

మన మాటలలో నాలుక జారకుండ మన నోరును కాచుకొనవలసిందిగా చేయబడిన హెచ్చరికలు, బైబిలు గ్రంథంలో మనకు ఎన్నో హెచ్చరికలు కనబడుతాయి, "తన నోరు కాచుకొనువాడు తన్ను కాపాడుకొనును, ఊరకొనక మాటలాడువాడు తనకు నాశనము తెచ్చుకొనును" అని సొలొమోను సామెతలు (13:3)లో తెలియజేస్తున్నాడు. "ఆతురపడి మాట లాడువాని చూచితివా? వానికంటె మూర్ఖుడు సుళువుగా గుణపడును" అని (29:20)లో తెలియజేస్తున్నాడు. నాలుకకున్న అద్భుత శక్తిని గురించి యాకోబు తెలియజేస్తున్నాడు:

> ఆలాగుననే నాలుక కూడా చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును! నాలుక అగ్నియే; నాలుక మన అవయవములలో ఉంచబడిన పాప ప్రపంచమై సర్వశరీరమునకు మాలిన్యము కలుగజేయుచు, ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును; అది నరకముచేత చిచ్చుపెట్టబడును (యాకోబు 3:5, 6).

తన సహోదరుని చూచి వ్యర్థుడా అని *చెప్పువాడు* మహాసభకు లోనగును. ద్రోహీ అని *చెప్పువాడు* నరకాగ్నికి లోనగును (మత్తయి 5:22; నొక్కి చెప్పింది నాది) అన్న విషయాన్ని మునుపటి పాఠంలో మనం నేర్చుకున్నాం. మన నోటినుండి వచ్చు మాటల మీద దృష్టియుంచి ఈ పాఠమును నేర్చుకుందాం.

మన మాటల గురించి వాక్యం ఎందుకు అంత ఖచ్చితంగా చెబుతుందని కొంతమంది ఆశ్చర్యపోవచ్చు. "ఈ లోకంలో ఎన్నో సమస్యలుండగా, *మాటల* గురించి చర్చించడం సమయాన్ని వృథా చేయడం కాదా?" అని మీరు అడుగవచ్చు. మీకందరికీ తెలిసిన విధంగానే, జ్ఞాన యుక్తమైన మాటల ద్వారానే ఎంత పెద్ద సమస్యనయినా మనం పరిష్కరించగలం. మన మాటలను గురించిన చర్చ ఒక క్రైస్తవునిగా మనకు ఎంతో అవసరం. ఎందుకంటే, మన మాటలు దేవునితో మన సమర్పణను ప్రతిబింబింపకపోయినట్టయితే, మనము "ఈ లోకమునకు ఉప్పు మరియు వెలుగుగా" (మత్తయి 5:13, 14) ఉండలేము. ఈ పాఠమునకు "తెరచుటకు ముందు ఆలోచించండి" అన్న శీర్షికను యిచ్చాను. "మీ నోరును తెరుచుటకు ముందు ఆలోచించండి!" అని దీని అర్థం.

### వాక్య భాగం

**వారు ఏమి విన్నారు?**

మత్తయి 5:33-37ను అధ్యయనం చేయడంతో మన పాఠమును ప్రారంభిద్దాం. యూదులు విన్న విషయం మరియు ప్రభువు బోధించిన విషయమునకు మధ్యగల వ్యత్యాసాన్ని

యిక్కడ చూస్తున్నాం. "మరియు – నీవు అప్రమాణము చేయక నీ ప్రమాణములను ప్రభువునకు చెల్లింపవలెనని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా ..." (33ఎ వచనం) అన్న మాటలతో మన వాక్యం మొదలవుతుంది. "నీవు అప్రమాణము చేయవద్దు" అని KJVలో ఉంది. "అప్రమాణము" అను మాట ప్రమాణము చేసి అబద్ధము చెప్పుటను సూచిస్తుంది. వారు విన్న విషయం గురించి ప్రస్తావిస్తూ ప్రభువు ప్రారంభిస్తున్నారు: "మీ ప్రమాణములను ప్రభువునకు చెల్లించాలి" (33బి వచనం) అని KJV ప్రస్తావించింది.

యిక్కడ ప్రభువు ప్రస్తావించిన వాక్యం పాత నిబంధనలో యిలాగే లేదు గాని, కొన్ని వాక్యముల సారాంశం మాత్రమే. యిక్కడ ఉన్న రెండు వాక్యాలను గమనించండి:

> "ఒకడు యెహోవాకు మ్రొక్కుకొనినయెడల లేక తాను బద్ధుడగుటకు ప్రమాణము చేసినయెడల అతడు తన మాట తప్పక తన నోటనుండి వచ్చిన దంతయు నెరవేర్చవలెను" (సంఖ్యాకాండము 30:2).
>
> "నీవు నీ దేవుడైన యెహోవాకు మ్రొక్కుకొనిన తరువాత ఆ మ్రొక్కుబడిని చెల్లించుటకు తడవుచేయకూడదు. నీ దేవుడైన యెహోవా తప్పక నీవలన దానిని రాబట్టుకొనును, అది నీకు పాపమగును" (ద్వితీయోపదేశకాండము 23:21; 22, 23 వచనాలు చూడు).

చేసిన ప్రమాణమును నెరవేర్చుటకు ఇయ్యబడిన సూచనలు పది ఆజ్ఞలలోని మూడవ ఆజ్ఞను సూచిస్తున్నాయి: "నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా ఉచ్చరింపకూడదు" (నిర్గమకాండము 20:7ఎ). "నా నామమునుబట్టి అబద్ధపు ప్రమాణము చేయకూడదు; నీ దేవుని నామమును అపవిత్రపరచకూడదు; నేను **యెహోవాను**" (లేవీయకాండము 19:12) అని లేవీయకాండములో దేవుడు సెలవిస్తున్నాడు. ఈ ప్రారంభపు మాటలు తొమ్మిదవ ఆజ్ఞను ప్రతిబింబిస్తున్నాయి: "... అబద్ధసాక్ష్యమును పలుకకూడదు" (నిర్గమకాండము 20:16).

సంఖ్యాకాండం 30:2 వాక్య భాగంలో "మ్రొక్కుబడి" మరియు "ప్రమాణము" అను మాటలు ఉపయోగించబడ్డాయి. మ్రొక్కుబడి అంటే, "ఒక కార్యమును నెరవేర్చబడుటకు ఒక వ్యక్తి ముందుగానే చేసుకునే ఒప్పందం." అలాగే, ప్రమాణం అంటే, ఒక వ్యక్తి చెప్పు మాటకు సత్యపూరితంగా[1] దేవున్ని "సాక్షిగా" పేర్కొనడం.[2] ఏదేమైనా, "మ్రొక్కుబడికి, ప్రమాణమునకు మధ్యగల వ్యత్యాసం స్పష్టంగా పేర్కొనబడలేదు."[3] NASB బైబిలులో "మ్రొక్కుబడి" అను పదం మత్తయి 5:33లో వాడబడితే, "ప్రమాణం" అను పదం 34 మరియు 36 వచనాల్లో పేర్కొనబడింది.[4] ఈ పాఠములో, ఈ పదాలను కొంచెం అటు యిటుగా వాడుతుంటాం. "చేయలేని మ్రొక్కుబడులు, దేవుని నామమును వ్యర్థముగా ఉపయోగించడం, అప్రమాణములను చేయడం వంటి పనులను మోషే ధర్మశాస్త్రం" తీవ్రంగా ఖండిస్తుంది.[5]

## ప్రభువు ఏమి చెప్పారు

ప్రమాణములను చేయడం గురించి పాత నిబంధన ఏమి తెలియజేస్తుందో చెప్పిన తరువాత, యేసు యిలా అంటున్నారు,

> నేను మీతో చెప్పునదేమనగా – ఎంత మాత్రము ఒట్టుపెట్టుకొనవద్దు. ఆకాశము తోడనవద్దు; అది దేవుని సింహాసనము. భూమి తోడనవద్దు, అది ఆయన పాద పీఠము, యెరూషలేము తోడనవద్దు,[6] అది మహారాజు పట్టణము. నీ తల తోడని ఒట్టుపెట్టుకొనవద్దు, నీవు ఒక

వెంట్రుకనైనను తెలుపుగా గాని నలుపుగా గాని చేయలేవు (మత్తయి 5:34-36).

ప్రభువుని మాటలను అర్థం చేసుకోవాలంటే, మొదటి శతాబ్దంలో యూదుల ఆచారములను మీరు గమనించాలి. ఏయే విషయాల్లో ఒట్టు పెట్టుకొనదగ్గవి, ఏవి కాదు అన్న బోధనను యూద మత బోధకులు ప్రజలకు బోధించారు. ఈ విధానాన్ని గురించే మత్తయి 23వ అధ్యాయాంలో ప్రభువు పరిసయ్యులు, శాస్త్రులను ఖండిస్తున్నారు:

> "అయ్యో అంధులైన మార్గదర్శకులారా, ఒకడు దేవాలయము తోడని ఒట్టుపెట్టుకొంటె, అందులో ఏమియు లేదు గాని దేవాలయములోని బంగారముతోడని ఒట్టుపెట్టుకొంటె, వాడు దానికి బద్ధుడని మీరు చెప్పుదురు. అవివేకులారా, అంధులారా, ఏది గొప్పది? బంగారమా, బంగారమును పరిశుద్ధపరుచు దేవాలయమా? మరియు - బలిపీఠము తోడని ఒకడు ఒట్టుపెట్టుకొంటె, అందులో ఏమియు లేదుగాని, దానిపైనుండు అర్పణము తోడని ఒట్టుపెట్టుకుంటే దానికి బద్ధుడని మీరు చెప్పుదురు. అవివేకులారా, అంధురాలా, ఏది గొప్పది? అర్పణమా, అర్పణమును పరిశుద్ధపరచు బలిపీఠమా? బలిపీఠము తోడని ఒట్టు పెట్టుకొనువాడు, దాని తోడనియు దాని పైనుండు వాటన్నిటి తోడనియు ఒట్టుపెట్టుకొనుచున్నాడు. మరియు దేవాలయము తోడని ఒట్టుపెట్టుకొనువాడు, దాని తోడనియు అందులో నివసించువాని తోడనియు ఒట్టుపెట్టుకొనుచున్నాడు. మరియు ఆకాశము తోడని ఒట్టుపెట్టుకొనువాడు దేవుని సింహాసనము తోడనియు, దానిపైని కూర్చున్నవాని తోడనియు ఒట్టుపెట్టుకొనుచున్నాడు" (16-22 వచనాలు).

ప్రమాణము చేయునప్పుడు దేవుని పేరును ప్రస్తావించారా లేదా అన్న విషయాన్నిబట్టి ఆ ప్రమాణములు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఒకవేళ దేవుని పేరు ప్రమాణములో ఉపయోగించబడినట్టయితే; దానికి ఖచ్చితంగా బద్ధులైయుండాలని, ఒకవేళ దేవుని పేరు ప్రమాణములో ప్రస్తావించబడకపోతే, దానికి బద్ధులు కానవసరం లేదన్న బోధనను యూద మత నాయకులు బోధిస్తూ వచ్చారు. దాని ఫలితంగా, వారు పరలోకం, భూమి, యెరూషలేము పట్టణము, మరియు వారి తలలపై కూడ వారు ఒట్టుపెట్టుకొనుటకు వారు వెనుకాడలేదు. (అంటే వారు తమ జీవితం పై కూడ ఆనబెట్టేవారు[7]). యిటువంటి ప్రమాణములకు వారు ఖచ్చితంగా బద్ధులైయుండనవసరం లేదని వారు చెప్పేవారు. దీనిని చెబుతుంటే, నా చిన్నతనం నాటి విషయం ఒకటి నాకు గుర్తుకు వస్తుంది. నా చిన్నతనంలో యిద్దరు చిన్న పిల్లలు యిలా మాట్లాడుకునేవారు:

> "నువ్వది చేస్తానన్నావు గదా!"
> "కాని, నా వేళ్ళు మడిచిపెట్టుకున్నానుగా."
> "నాకు కనపడట్లేదుగా."
> "యిదిగో, నా వెనుక పెట్టుకున్నానయ్యా."

నా చిన్నతనంలో యిటువంటి నమ్మకం పిల్లల్లో ఎక్కువగా ఉండేది. వారు తమ చూపుడు వేలును మధ్య వేలుతో మడిచి పెట్టి ఏ విషయం చెప్పినా గాని, దానికి వారు బాధ్యులు కారు. దాన్ని వారు నెరవేర్చరు అని అర్థం.[8] ఈ నమ్మకం లేదా ఆయన తుంటరి తనం అనిపించినాగాని, దేవుని నామ ప్రస్తాపన లేకుండా చేయబడిన ప్రమాణం చెల్లదని

యూదులు చెప్పిన మాటకంటె యిది తుంటరితనం కాదు.

ఈ మాటలకు నవ్వి, "ఎంత తెలివి తక్కువ జనాలు వీరు! నేనైతే యిటువంటి పనులు అసలు చేయను" అని కొంతంది తలాడిస్తుంటారు. నిజంగానే మనం చేయమా? నిజం చెప్పాలంటే, జీవితంలోని ప్రతి సందర్భానికి కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. వారు యథార్థవంతంగా ఉంటున్నామని చెప్పినా గాని, తమ వ్యాపారాల్లో, రాజకీయాల్లో, యితర దేశములతో వారి సంబంధాలలో వారు చెప్పే అబద్ధాలను సమర్థించుకుందామనే చూస్తుంటారు.

యేసు కాలంలో ఈ విషయం పై యూదులు ఏర్పరచిన విధానం గురించి ఆయన మాట్లాడుతూ, వారు దేనిమీద ఒట్టుపెడుతున్నారో అన్నియూ కూడ దేవునికి సంబంధించినవైయున్నవన్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తున్నారు. ఆకాశము దేవుని సింహాసనము, భూమి ఆయన పాద పీఠము (యెషయా 66:1 చూడు). ప్రభువు కాలంలో, యెరూషలేము ఆయన ఏర్పరచుకున్న పట్టణము.[9] యిక్కడే ఆయన ఆలయం ఉంది. అలాగే మన శిరస్సుకూడ ఆయన చేతితో సృజింపబడింది. "ప్రతి వెంట్రుకలో కూడా ఆయన చేతిపని కనబడుతూ ఉంది."[10]

ఈ నాడు అనేకమంది బ్లీచింగు ద్వారా తమ వెంట్రుకలను తెల్లగా, డయింగు ద్వారా తమ వెంట్రుకలను నల్లగా చేస్తున్నారు గదా! మరి "నీవు ఒక వెంట్రకనైనను తెలుపుగా గాని, నలుపుగా గాని చేయలేవు" అన్న ప్రభువు మాటలకు అర్థం ఏమిటి? అని మీరు అడగవచ్చు. బ్రిటీషు రేడియో ప్రకారం, తలకు రంగు వేసే పద్ధతి "సుమారు నాలుగువేల సంవత్సరాల"[11] నాటినుండి ఉంది. అయితే యేసు యిక్కడ జుట్టు యొక్క సహజ రంగు గురించి మాట్లాడుతున్నారు. నేను వృద్ధాప్యానికి చేరువ అవుతున్నా గాని, నా జుట్టు యింకా తెల్లబడలేదు. అయితే నా మరదలి జుట్టు మాత్రం అప్పుడే నెరసిపోయింది. ఈ విషయం మనమెవ్వరి ప్రమేయం లేకుండానే జరుగుతుంది. యేసు ప్రభువు చెప్పాలనుకున్న విషయం యిదే – మన జీవితంలో చిన్న భాగమైన వెంట్రుకను కూడ సృష్టికర్తనుండి మనము వేరుచేయలేము. అందుకనే, దేవుని నామము పేరిట చేయబడిన ప్రమాణమునకు బద్ధులమైయుండి, దేవుని చేత సృష్టించబడిన వాటి పేరిట చేయబడిన ప్రమాణము చెల్లదను అభిప్రాయం తెలివి తక్కువదిగా స్పష్టమవుతుంది.

దేని మీద ఒట్టు పెట్టుకోవడం మంచిది లేదా మంచిది కాదు అన్న విషయాన్ని గురించి ఆలోచించడంకంటే "ఒట్టుపెట్టుకొనవద్దు" అని ప్రభువు చెప్తున్నారు, "మీ మాట 'అవునంటే, అవును,' 'కాదంటే కాదు' అని యుండవలెను" (మత్తయి 5:37ఎ) అని ఆయన స్పష్టం చేస్తున్నారు. యిక్కడ రెండుసార్లు చెప్పబడిన "అవును" లేదా "కాదు" అనే మాటకు యిది నొక్కి చెప్పబడిన మాటగా గమనించవచ్చు.[12] ఏదైనా విషయంలో అవును అని చెప్పినట్లయితే, అది అవునుగానే స్థిరంగా ఉండాలి. మీరు కాదని చెబితే కాదనే *అర్థం* ఉండాలి. అంతేగాని, మీ మాటలకు అదనంగా ప్రమాణం చేయవలసిన అవసరం రాకూడదు. యిదే విషయాన్ని యాకోబు తన పత్రికలో ప్రస్తావిస్తున్నాడు: "నా సహోదరులారా, ముఖ్యమైన సంగతి ఏదనగా, ఆకాశము తోడనిగాని భూమి తోడని గాని మరి దేని తోడని గాని ఒట్టుపెట్టుకొనక, మీరు తీర్పుపాలు కాకుండునట్లు అవునంటే అవును కాదంటే కాదు అని ఉండవలెను" (యాకోబు 5:12).

"వీటికి మించునది దుష్టునినుండి పుట్టునది" (మత్తయి 5:37బి) అని యేసు చెప్తున్నారు. "దుష్టుని" (*poneros*) అను మాటకు "దుష్టుడు" (సాతాను) లేక "దుష్టత్వము" (దుష్ట హృదయము వంటిది) అను అర్థాలున్నాయి. యిటువంటి అస్పష్ట పదం కొండమీద ప్రసంగంలో మరో రెండు చోట్ల పేర్కొకనబడింది (5:39; 6:13), మన అధ్యయనంలో చెప్పుకున్న విధంగానే కొంచెం వ్యత్యాసం ఉంది. ఈ రెండు సందర్భాలలోనూ, యిటువంటి నిష్ప్రయోజనమైన ప్రమాణాలకు మూలం దుష్టుడు. మన ముంటున్నటువంటి ఈ దుష్ట ప్రపంచంలో అసత్య వాతావరణంలో మ్రొక్కుబళ్ళు మరియు ప్రమాణల అవసరం కొంతమేరకు ఉందని కూడా దీని భావం.

## ఉపదేశం

### యేసు ఏమి బోధించలేదు

మన ముందున్న వాక్యమును పరిశీలించిన తరువాత, "ప్రభువు చెప్పిన మాటలకు ఆయన ఉద్దేశం *ఏమిటన్న* ప్రశ్న మనలో తలెత్తవచ్చు?" మొదటిగా, ఆయన ఏమి బోధించుట లేదో చూద్దాం.

ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎన్నడూ కూడ క్రైస్తవుడు అన్న వ్యక్తి ప్రమాణము గాని, ఒట్టుగాని పెట్టకూడదని యేసు యొక్క బోధన అన్న భావనను కొంతమంది ప్రతిపాదిస్తున్నారు. ప్రమాణం అనేది కొన్ని తెగల్లో విశ్వాస సంబంధ ఆచారంగా వస్తుంటే, క్రైస్తవులకు యిది వ్యక్తిగత మనసాక్షికి సంబంధించిన అంశంగా ఉంది. న్యాయస్థానములో చేసే ప్రమాణమునకు ప్రత్యేక స్థానం ఉంది. మత్తయి 5:33–37 వాక్య భాగమును అక్షరార్థముగా తీసుకున్నట్లయితే, దేవుని పిల్లలు అయిన ఏ క్రైస్తవుడు కూడ న్యాయస్థానములో ప్రమాణము చేయకూడదు. యేసు ప్రభువు యొక్క బోధన ఇదేనని స్థిరముగా నమ్ముతున్నట్లయితే, మీ మనసు చెప్పిన విధంగానే మీ పనులు ఉండాలి. మీ మనసాక్షిని మీరకూడదు.[13] మిగతా దేశముల సంగతి నాకు తెలియదు గాని, అమెరికా దేశంలో మాత్రం, సాక్ష్యమియ్యుటకు వచ్చినవారు న్యాయస్థానంలోని ప్రమాణమును చేయుటకు సమ్మతించినప్పుడు, వారు సత్యమునే చెప్పుటకు సూచనగా, "అసత్య ప్రమాణమునకు విధించబడు శిక్షకు లోబడి సాక్ష్యం చెప్పుచున్నాను" అని చెప్పాలి.[14]

యేసు హృదయంలో మాత్రం యిటువంటి విధానం లేదు, కాబట్టి, యిందుకు జె. డబ్ల్యూ. మెక్‌గార్వే ఈ విధమైన ముగింపును యిస్తున్నాడు "కొన్ని ప్రామాణిక పరిస్థితుల్లో ఈ నిషేధమును వివరించవచ్చు" అని చెప్తున్నాడు.[15] ఈ "ప్రామాణిక పరిస్థితులు" ఏవి? దేవున్ని గురించిన ఉదాహరణతోనే ప్రారంభిద్దాం. దేవుడు రెండు మార్లు చేసిన వాగ్దాన ప్రమాణం గురించి హెబ్రీ గ్రంథకర్త యిలా పేర్కొంటున్నాడు:

> దేవుడు అబ్రహామునకు వాగ్దానము చేసినప్పుడు తనకంటె ఏ గొప్పవాని తోడు అని ప్రమాణము చేయలేకపోయెను గనుక, తనతోడు అని ప్రమాణము చేసి – "నిశ్చయముగా నేను నిన్ను ఆశీర్వదింతును, నిశ్చయముగా నిన్ను విస్తరింపజేతును" అని చెప్పెను (హెబ్రీయులకు 6:13, 14).

(... మరియు ప్రమాణము లేకుండ యేసు యాజకుడు కాలేదు గనుక ఆయన మరి శ్రేష్ఠమైన నిబంధనకు పూటకాపాయెను. వారైతే [లేవీయులు] ప్రమాణము లేకుండ యాజకులగుదురు గాని యీయన, 'నీవు నిరంతరము యాజకుడవై యున్నావని ప్రభువు ప్రమాణము చేసెను; ఆయన పశ్చాత్తాపపడడు' అని యీయనతో చెప్పినవానివలన ప్రమాణ పూర్వకముగా యాజకుడాయెను) (హెబ్రీయులకు 7:20-22).

తరువాతదిగా యేసు గురించిన ఉదాహరణను గమనిద్దాం. యేసు క్రీస్తు తన విచారణ సమయంలో, సమాజ మందిరములోని ప్రధాన యాజకుని యొద్దకు తేబడినప్పుడు, అతడు, "నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే, ఆ మాట మాతో చెప్పుమని జీవముగల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాననెను. అందుకు యేసు - నీవన్నట్టే ..." (మత్తయి 26:63). యిక్కడ వాడబడిన "తోడు" "adjure" (*exorkizo*) అను మాటకు "ప్రమాణముతో చెప్పుట" అని అర్థం.[16] "ప్రమాణం పూర్వకంగా" అని NIV బైబిల్లో చెప్పబడింది. యిక్కడ ప్రమాణమునకు వాడబడిన ప్రామాణికాన్ని గమనించండి. యిది "జీవముగల దేవుడు." ఒకవేళ యేసు ప్రమాణం, ఒట్టుల మీద నమ్మకం లేకపోయినట్లయితే, ఆయన మౌనంగా ఉండిపోయేవారు. కాని యిక్కడ అలా జరుగలేదు, "ఆయన నీవన్నట్టే" (64 వచనం) అని జవాబునిచ్చారు. యిది ప్రమాణమునకు లోబడి సాక్ష్యమియ్యడము. "నీవు చెప్పినట్టే" అని NIV బైబిల్లో ఉంది.

అలాగే పౌలును గురించిన ఉదాహరణను కూడ గమనించవచ్చు. తను బోధించిన బోధ యొక్క యథార్థతను దేవుని సాక్షిగా పౌలు తరచూ పేర్కొనేవాడు. ఉదాహరణకు, ఫిలిప్పీయులకు 1:8లో "క్రీస్తు యేసు యొక్క దయారసమునుబట్టి, మీ అందరి మీద నేనెంత అపేక్ష కలిగియున్నానో దేవుడే నాకు సాక్షి" అని ఆయన చెప్తున్నాడు (రోమీయులకు 1:9; గలతీయులకు 1:20; 2 కొరింథీయులకు 1:23 చూడు). యిందునుబట్టి, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, ప్రమాణము చేయుట కొంతవరకు సబబు అన్న విషయం అర్థమవుతుంది.

## యేసు ఏమి బోధిస్తున్నారు

ఒకవేళ మన వాక్య భాగం యొక్క ఉద్దేశం, ప్రమాణం, ఒట్టులను పూర్తిగా నిషేధించడం కాకపోయినట్టయితే, మరి దీని ఉద్దేశం ఏమిటి? ప్రభువు తన మాటలను బట్టి మనం నేర్చుకోవాలనుకుంటున్న బోధన ఏమిటి? మత్తయి 5:33-37 వాక్య భాగంనుండి కొన్ని సూత్రాలను మనం నేర్చుకొనవచ్చు.[17] ఈ మూడు విషయాలను గమనించండి.

(1) *నిష్ప్రయోజన ప్రమాణములను చేయకండి.* దేవుని నామమును, దేవుని సంబంధ విషయాలను ప్రస్తావిస్తూ చేసే నిష్ప్రయోజన[18] ప్రమాణాలు, మాటలను, వ్యాఖ్యాలను చేయవద్దని ఈ వాక్యభాగం బోధిస్తుంది. ఈ క్రింది ఉదాహరణలను గమనించండి:[19]

- "దేవుని పేర. ..."
- "ఆకాశము తోడు. ..."
- "ప్రతి పరిశుద్ధ విషయం తోడు. ..."

నిష్ప్రయోజన ప్రమాణాలు కేవలం తప్పేకాదు, అవి పనికి రానివి కూడాను. మీరు ఒక వ్యక్తిని ఏ విధంగాను నమ్మకపోయినట్లయితే, ఆ వ్యక్తి ప్రమాణం చేసినా కూడా ఆ వ్యక్తిని

నమ్మరు. ఒకరు యిలా చెబుతున్నారు, “ఒక యథార్థవంతుడు ప్రమాణం చేయకపోయినా గాని చేర్చుకొనబడతాడు, కాని, ఒక అసత్య వర్తనుడు వెయ్యి ప్రమాణాలు చేసి చెప్పినా గాని ఆ వ్యక్తిని ఎవరూ నమ్మరు.”

నిష్ప్రయోజనమైన ప్రమాణం చేయడం, దేవుని నామమును, పరిశుద్ధ సంబంధ విషయాలలో వేషధారణను సూచిస్తుంది. మా ప్రాంతంలో యిటువంటి మాటలు సర్వసాధారణం:

- కొంతమంది సంతోషం కలిగినప్పుడు “అబ్బా, దేవా” అని అంటుంటాం!
- ఒకరి పట్ల మరొకరికి యిష్టం లేనప్పుడు “దేవుని పేరుతో నువ్వు చేస్తున్నదేంటి?” అని అంటారు.
- మరి కొంతమంది కష్ట సమయంలో, “నేను ఈ పరిస్థితుల్లో ఎలా ఉంటున్నానో దేవుడికే తెలుసు” (లేదా “పరలోకానికే తెలుసు”).[20]

మరికొన్ని పరిస్థితుల్లో యేసుని నామమును ఆశ్చర్యాన్ని వెలిబుచ్చడంలో వాడుతారు.[21] అసత్య ప్రమాణికుడు చేసిన నేరం కంటే గొప్ప నేరం మరేదీ లేదని ఆల్‌బర్ట్ బార్న్స్ వ్రాస్తున్నాడు,

> ... అసత్య ప్రమాణం చేసిన వారిని ఒక్క దెబ్బ కొట్టి నరకానికి త్రోసివేయకుండా వారిని కూడ దేవుడు సహించడం కంటే, గొప్ప ఆశ్చర్యకరమైన విషయం ఈ లోకంలో ఏదీలేదు. దేవుని యొక్క నామమం ప్రతి రోజు, ప్రతి గంట, ప్రతి క్షణం వేలమంది చేత దూషనకు గురవుతున్న ఈ ప్రపంచంలో ఆయన కోపపడుటకు త్వరపడువాడు గాక, తన కృపను విస్తరిస్తున్నాడు![22]

(2) *యథార్థవంతులైయుండండి.* యథార్థవంతుడైన వ్యక్తికి ప్రమాణములతో పనియుండదని కొద్దిసేపటి క్రితమే మనం చెప్పుకున్నాం. మన వాక్య భాగంనుండి మనం నేర్చుకొనవలసిన పాఠము ఏమిటంటే, మనమందరమూ యథార్థవంతులైయుండాలి. ప్రమాణము చేయనవసరం లేకుండానే మన మాట నమ్మదగినదిగా ఉండాలి.

ఒక చిన్న పిల్లవాడు తన తమ్ముడితో, తమ తల్లిదండ్రుల భావాలను ఏ విధంగా అర్థంచేసుకోవాలో యిలా తెలియజేస్తున్నాడు. వారు, “అవును” అని అంటే, “కావచ్చు” అని అర్థం. ఒకవేళ వారు “చూద్దాం” అని అంటే, “కాదు” అని అర్థం. ఒకవేళ వారు “కాదు” అని అంటే, తమకు కావల్సింది దొరికే వరకు “బ్రతిమలాడాలని” అర్థం. యిక్కడ పిల్లవాడి ఆలోచనా ధోరణి తప్పు. ఒకవేళ యిది సరైన ఆలోచన అయితే, “మీ మాట అవునంటే అవును అని కాదంటే కాదు” అన్న మన వాక్యాన్ని వారి తల్లిదండ్రులు నేర్చుకొనియుండలేదు.

మీరు, నేను కూడ ఈ చిన్న పిల్లవాడి తల్లిదండ్రులవలె యుండకూడదు.[23] ఏదైనా విషయాన్ని చెప్పేటప్పుడు “అవునంటే అవును” అని “కాదు అంటే నిచ్చితంగా కాదు” అని మనం చెప్పాలి. మనం యథార్థవంతులముగా ఉండాలి. “మీరు అబద్ధమాడుట మాని ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను” (ఎఫెసీయులకు 4:25).

నేను చిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడు, “అతడు మాట మీద నిలబడే మనిషి” మరియు “మాట కోసం విలువిచ్చే మనిషి” అన్న పదాలు తరచూ వినబడుతుండేవి. అంటే, ఆ మనిషి

యథార్థంగా మాట్లాడే వ్యక్తి అని అర్థం. అనేకమైన ఒప్పందములు కరచాలనంతో ఒప్పందం చేయబడతాయి. మనముంటున్న ఈ నాగరిక ప్రపంచంలో, ప్రతి విషయం కూడ న్యాయపర పత్రాలతో ఒప్పందం చేయబడి, కేవలం న్యాయవాదులు మాత్రమే అర్థం చేసుకొనగల భాషతో యివి రూపొందించబడియుంటాయి. ఈ నాడు ప్రజలు యథార్థత లేకుండా, స్వనీతిపరులుగా మారుతున్న ఈ సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. చాలా సంవత్సరాల క్రితం, మేము యింటిని కొన్నప్పుడు, అప్పటి న్యాయపర ఒప్పంద పత్రాలు కొన్ని పేజీలే ఉండేవి కాని, యిప్పుడు నాలుగు సంవత్సరాల క్రితం, ప్రస్తుతం మేముంటున్న యిల్లును కొంటున్నప్పుడు, ఆ ఒప్పంద పత్రాల సంఖ్య దాదాపుగా ఒక అంగుళం మందం మేర పెరిగాయి.

మీరు, నేను కూడ ఈ లోకములోని అధికారమునకు లోబడియుండాలి (రోమీయులకు 13:1), కాబట్టి మనం జరిపే లావాదేవీలకు ఏర్పరచబడిన న్యాయపర విధివిధానాలనుండి మనం తప్పించుకొనలేము. ప్రతి ఒక్కరం కూడా, యథార్థముగా ఉండుటకు, అలాగే సత్యమునే పలుకుటకు శతవిధాలా ప్రయత్నించాలి.[24]

(3) *మాటకు కట్టుబడియుండండి.* యింతకు ముందు మనం నేర్చుకున్న పాఠంవంటిదే ఈ పాఠంకూడాను: మీ మాటకు కట్టబడియుండండి. నా లెక్క ప్రకారం, చేస్తానని చెప్పిన మాట తప్పినవారు అనేకమంది ఈ లోకంలో ఉన్నారు. మననుండి సాయం పొందగోరి వచ్చిన వారినుండి త్వరగా తప్పించుకోవాలంటే, వారికి సహాయం చేస్తానని చెప్పి తప్పించుకోవడమేనని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. "తప్పనిసరిగా, ఆ పని నేను నీకు చేసిపెడతానుగా" అంటూ ఎంతోమంది అంటుంటారు. యిక యివే చివరి మాట లవుతాయి. యిటువంటి ప్రమాణాలు తీర్చబడనక్కరలేదని వారు భావిస్తుంటారు.

వివాహ సమయంలో చేయబడే ప్రమాణాల గురించి ఒక విషయాన్ని యిక్కడ నేను ప్రస్తావించాలి.[25] మునుపటి వాక్య భాగానికి (మత్తయి 5:31, 32) మరియు "అవును/కాదు" వాక్య భాగానికి మధ్య "సహజ సంబంధము" ఉంది.[26] వివాహ సమయములో చేసే ప్రమాణాలకు వ్యత్యాసముంటుంది. "వ్యాధియందును, అనారోగ్యమందును," "యితరులను విడిచి పెట్టి" మరియు "మనమిద్దరం కలిసి జీవించు కాలమంతా" వంటి మాటలను యిందులో వాడుతారు. ఈ ప్రమాణాలు చేసేవారు వాటిని గ్రహిస్తున్నారా? వారు చెప్తున్న మాటలకు అర్థాన్ని ఎరిగియుంటున్నారా? "ఉంటాను" అని వారు చెప్తుండగా, "అతడు లేక ఆమెను సంతోషంగా ఉంచునంత కాలం ఉంటాను" అని చెప్తూ జీవిస్తున్నారా? వారు "అవును" అంటే, "అవుననే" చెప్తున్నారా లేక "కావచ్చునని" చెప్తున్నారా?

కొద్ది సంవత్సరాల క్రితం, నేను నా చేతురాలా వివాహం జరిపించిన యువతీ యువకులు, విడాకులు కొరకు తాపత్రయ పడడం నన్నెంతగానో కృంగదీసింది. ఈ సంఖ్యను తగ్గించుటకు వివాహ సందర్భం ముందు కొన్ని పేజీలు ఉండే పత్రాలను దంపతుల కొరకు సిద్ధపర్చాను. వివాహ వేడుకలో అవసరమగు సాక్ష్యం మరియు ప్రత్యేక సూచనలను సూచించే పత్రాలను పొందుపరిచాను. వీటిలో అతి ముఖ్యంగా, వారు విడాకులు కొరకు న్యాయవాదిని సంప్రదించుటకు ముందు సూచన కూడ వ్యర్థంగా తోచింది. నేను కౌన్సిలింగు చేసిన ఎంతో మంది కూడ విడాకుల కొరకు ప్రయత్నించారు. యిది ఎందుకో నాకు అర్థం కాలేదు. "వారు న్యాయవాదిని సంప్రదించుటకు ముందే నన్ను కలుస్తామని వారు *ప్రమాణం* చేశారు. కాని

వారు అలా చేయట్లేదే!" అని భార్యతో అంటుండేవాడిని. తరువాత నాకు అర్థమయింది. వివాహ సమయంలో దేవుని ఎదుట వారు చేసిన పవిత్ర ప్రమాణాలను సైతం వారు లెక్క చేయడం లేదు గదా, అలాంటిది నాతో వారు చేసిన ప్రమాణాన్ని మీరడంలో ఆశ్చర్యం లేదు గదా!

మీరు యథార్థవంతులైయుండాలని మిమ్ములను మనస్ఫూర్తిగా కోరుతున్నాను: మీరొక పనిని చేస్తానని మీరు చెప్పినప్పుడు దానిని తప్పనిసరిగా చేయండి. "ఒకవేళ ఈ ప్రమాణం లేదా వాగ్దానాన్ని నెరవేర్చడం కష్టం అయితే? దీనిని *నెరవేర్చడం* కోసం మరింకేదయినా త్యాగం చేయాల్సివస్తే?" అని మీరు అడుగవచ్చు. ఒక పనిని చేస్తానని మీరు వాగ్దానం చేస్తే దాన్ని నెరవేర్చండం అది ఎంత *కష్టమయినా* సరే, మాట నిలువబెట్టుకోండి.

యథార్థవంతుడైన క్రైస్తవుని సమాధి కార్యక్రమంలో ఉపయోగించుటకు తగిన వాక్యాన్ని నేను కీర్తలన 15లో కొద్ది సంవత్సరాల క్రితం కనుగొన్నాను.[27] అటువంటి వ్యక్తి గురించి దావీదు వివరిస్తూ, 4వ వచనంలో ఈ విషయాన్ని తెలియజేస్తున్నాడు: "అతడు ప్రమాణము చేయగా, నష్టము కలిగినను మాట తప్పడు" అంటే, దేవునియందు భయ భక్తులు కలిగిన వ్యక్తి, ఒక వాగ్దానం చేస్తే, అది ఎంత నష్టము, కష్టము అయినాగాని, దానిని అతడు నెరవేర్చుతాడు. "కష్టమయినా గాని అతడు చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తాడు" అని NIV బైబిలు తెలియజేస్తుంది. "కష్టమయినా గాని, మీ మాట యథార్థంగా ఉండాలి"[28] అని ఒక వాక్యం ఉంది. ఈ సూత్రం గురించి లారీ కాల్విన్ ఒక చక్కని ఉదాహరణను యిస్తున్నాడు:

> నేను ఏడేళ్ళ వయసులో ఉండగా, మా తాతగారు తన దగ్గరున్న మోడల్ టి కారును అమ్మకానికి పెట్టారు. ఒక రోజు ఉదయాన్నే ఒక వ్యక్తి ఆ పాత కారుని 1,000 డాలర్లకు కొంటానని వచ్చాడు. ఒప్పందం అయ్యాక ఆ వ్యక్తికి మా తాతకారు కరచాలనం యిచ్చారు. కానీ, ఆ కారుని యింకా తీసుకొని వెళ్ళలేదు. "ఈ రోజు సాయంత్రానికి వచ్చి డబ్బిచ్చి కారును తీసుకెళతాను, ఫర్వాలేదు గదా!" అని ఆయన అంటే, "ఫర్వాలేదు" అని మా తాతగారు అన్నారు.
>
> అదే రోజు మధ్యాహ్నం మరో వ్యక్తి 2,500 డాలర్లకు ఆ పాత కారునికొంటానని వచ్చారు. నాకింక యిప్పటికీ గుర్తే, మా తాతకారు పెద్దగా నవ్వి, "ఈ రోజు ఉదయాన్నే మీరు రావాల్సింది. 2,500 తీసుకునేవాడిని. కాని, ఈ ఉదయమే మరొక వ్యక్తికి 1,000 డాలర్లకు దీనిని అమ్మి అతనితో కరచాలనం చేశాను" అని చెప్పారు.[29]

ఒక్కసారి మనం చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడం కష్టంగా అన్పించే పరిస్థితులు రావచ్చు. ఒక చోట మాట్లాడడానికి నేను వాగ్దానం చేసిన తరువాత అనారోగ్యంపాలై ఆ మాటను నేను నెరవేర్చలేకపోయాను. ఒక తండ్రిగా, కొన్ని సందర్భాల్లో ముందువెనుకా ఆలోచించకుండా, కొన్ని వాగ్దానాలు చేసి వాటిని నెరవేర్చలేకపోయాను. (యిటువంటి సంఘటనలను తలచుకుంటే, బాధగా ఉంటుంది.) యిటువంటి సంఘటనలకు కొంత మినహాయింపు ఉంది. ఒకవేళ మనము మాట యివ్వడానికి *ముందు* దీని గురించి, పర్యవసానాలను గురించి ఆలోచించినట్లయితే, వీటి సంఖ్య తగ్గుతుంది. అందుకనే, కొన్ని సాధ్యమయ్యే వాగ్దానాలనే చేయండి, వాటిని నెరవేర్చండి అని మిమ్ములను మరోసారి వేడుకుంటున్నాను.

## ముగింపు

“మన సమజంలో యిప్పుడు యథార్థత విషయమైన సంక్షోభం నెలకొని ఉందని”[30] చెప్ప బడింది. దేవుని పిల్లలముగా మనము ఈ విధానాన్ని మార్చివేయాలి. మనము ఈ లోకమునకు ఉప్పు మరియు వెలుగైయున్న యెడల మనము యథార్థవంతులమైయుండాలి. యితరులు దేవుని యొద్దకు నడిపించబడాలంటే మనం యథార్థవంతులమైయుండాలి. రోజూ వారీ దినచర్యలో భాగమైన విషయాలలో మిమ్ములను యితరులు నమ్మకపోయినట్లయితే, మీరు చెప్పే దైవిక విషయాల గురించి వారు మిమ్ములను ఎలా నమ్ముతారు?

మరొకసారి యిది మిమ్ములను మీరు పరీక్షించుకొను సమయం. అసత్య ప్రమాణాలను చేయడం, దేవుని నామమును దూషించడం, వ్యర్థముగా ఉచ్చరించడం, నిజము చెప్పలేకపోవడం, మాట మీద నిలవలేకపోవడం వంటి విషయాలలో మీరు దేవున్ని క్షమాపణ అడుగవలసి రావచ్చు. దేవుని సహాయంలో అవి పూర్తిగా మార్చివేయబడాలి. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ ఎంతో కొంత అపరాధులైయున్నారు. మన క్రియలను బట్టి దేవున్ని మనం క్షమాపణ అడగాలి, మన భవిష్యత్తులో యిటువంటి పునరావృతం కాకుండా ఆయన సహాయాన్ని కోరాలి. మనం “మన నోటిని తెరువకముందు ఆలోచించేలా” ఆయన మనకు సహాయం చేయును గాక!

---

సూచనలు

[1]*The American Heritage Dictionary,* 4th ed. (2001), s.v. “ప్రమాణం.” [2]ఒకవేళ చేయబడిన ఒట్టు సత్యము కానట్లయితే, ఒట్టువేసినవానిని దేవుడు శిక్షిస్తాడు. [3]R. T. France, *The Gospel According to Matthew*, Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Inter-Varsity Press, 1985), 124. [4]మన వాక్య భాగంలో ఉపయోగించబడిన, గ్రీకు పదాలకొరకు పాఠం చివరిలో ఇయ్యబడిన “బోధన మరియు ఉపదేశాయుక్తమైన విషయాలు” గమనించండి. [5]D. A. Carson, “Matthew,” *The Expositor's Bible Commentary,* vol. 8 (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1984), 153. [6]యెరూషలేము గాక యితర ఉదాహరణల ముందు *en* అను పదం ఉంది. దీనికి “తో” అన్న పదం ఇయ్యబడింది. “యెరూషలేము” అన్న పదమునకు ముందు *eis*, toward అన్న పదం వాడబడింది. అంటే “వైపు” అన్న అర్థంతో వాడబడింది. అంటే యూదులు “యెరూషలేము పై” పెట్టు ఒట్టుకు ప్రాధాన్యమియ్యక, యెరూషలేము వైపు పెట్టు ఒట్టకు ప్రాధాన్యమిచ్చారు. [7]వారు చెప్పింది నిజము కాకపోయినట్టయితే వారు జీవవితాలు నాశనంలోకి తేబడతాయని అర్థం. [8]వేలు మడవడం అన్నది శుభసూచకంగా అనేక ప్రాంతాల్లో వాడబడుతుంది. దీని మూలం ఎక్కడో తెలియదు. [9]ఇది అంత సత్యం కాదు (యోహాను 4:20, 21), యేసు ఉన్న కాలంలో యిది సత్యం. [10]A. Lukyn Williams, “St. Matthew,” *The Pulpit Commentary,* vol. 15, ed. H. D. M. Spence and Joseph S. Exell (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1950), 165.

[11]“The History of Hair Dye” (http://www.bbc.co.uk/radio4/womanshour/05/2006_31_tue.shtml; Internet; accessed 30 May 2008). [12]ప్రసంగానుకూలంగా ప్రభువు ఈ పదాలను రెండుమార్లు ఉచ్చరించియుండవచ్చు. [13]రోమీయులకు 14:23ను గురించిన డేవిడ్ రోపర్ వ్యాఖ్యానాన్ని గమనించండి. “రోమీయులకు, 9,” ట్రూత్ ఫార్ టుడే (ఆగస్టు 2006; ఆంగ్ల సంచిక), 39. [14]Burton Coffman, *Commentary on the Gospel of Matthew* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1968), 67. [15]J. W. McGarvey, *The New Testament Commentary,* vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., 2006), 57. [16]W. E. Vine, Merrill F. Unger, William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 13. [17]ఈ పాఠం చివరిలోని “బోధన మరియు ఉపదేశాయుక్తమైన విషయాలు” గమనించండి. [18]ఈ వాక్యం ప్రకారం “అసత్యం” అంటే, “సరైన గమనం లేకపోవడం” అని అర్థం (*The American Heritage Dictionary,*

4th ed. [2001], s.v. "అసత్యం"). [19]ఈ పాఠములో నేను చెప్పిన ఉదాహరణలు నేను స్వయంగా విన్నవి. మీరు యింకా ఎన్నో ఉదాహరణలను ఉపయోగించవచ్చు. [20]కొన్ని సందర్భాలలో దేవుని మహిమ నిమిత్తం నా స్వంత ఉదహరణలను చెప్పవచ్చు. యింతకు ముందు ఎన్నో మార్లు చెప్పాను కాబట్టి అవి సాధారణమైపోయాయి. వాటిని సాధారణంగానే వాడవచ్చు.

[21]"గోష్" మరియు "జీజ్" వంటి పదాలను కూడ పేర్కొనవచ్చు. ఇవి దేవుని పరిశుద్ధ నామం యొక్క మారు రూపాలు. ("గోష్" అంటే "గాడ్," "జీజ్" అంటే "జీజస్"). అవి ప్రమాదకరంగా అన్పించకపోయినా, వాటిని వాడడం నేను మానేశాను. [22]Albert Barnes, *Notes on the New Testament: Matthew and Mark*, ed. Robert Frew (Grand Rapids, Mich.: Baker Book House, 1970), 58. [23]మనము యథార్థ వంతులముగా ఉండడానికే ముఖ్య కారణం మన యిల్లు, మన తల్లిదండ్రులు బోధన, గద్దింపు, మాదిరి (అబద్ధమాడుటవలన కలిగిన శిక్ష కూడా కారణం). [24]"నేను నిజమే చెబుతాను" అని చెప్పుకునే వారు నిజానికి ఏం చెప్తున్నారో తెలియని పరిస్థితుల్లో వారుంటుంటారు. ప్రేమతో సత్యమును వారికి బోధించాలి (ఎఫెసీయులకు 4:15). [25]ఇది పశ్చిమ దేశాల పరిస్థితిని తెలియజేస్తుంది. మీరు ఎక్కడున్నా, ప్రతి ఒక్కరూ తమ వివాహబంధానికి కట్టుబడియుండేలా బోధించాలి. [26]Larry Calvin, *The Power Zone* (Fort Worth, Tex.: Sweet Publishing, 1995), 84. [27]దైవిక స్త్రీ గురించి సామెతలు 31వ అధ్యాయం వివరిస్తుంది. దైవజనుని గురించి కీర్తనలు 15 అధ్యాయం వివరిస్తుంది. [28]Eugene H. Peterson, *The Message* (Colorado Springs, Colo.: NavPress Publishing Group, 1995), 663. [29]Calvin, 89. [30]Ibid., 91.